సాక్షి చిత్తూరు

మంగళవారం । 3 । జూన్ । 2025



బాబుగారి భవంతి సరే..

సీఎం ఇలాకాలో బాబుగారి భవంతి ధగధగ మెరిసిపోతోంది. పేదల ఇళ్లు మాత్రం మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. - IIలో



పోలీస్ గ్రీవెన్స్‌కు 53 అర్జీలు

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి 53 ఫిర్యాదులు వచ్చాయి. - IIలో



మా మొర ఆలకించండి!

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. - IIలో

న్యూస్‌రీల్

9న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలను ఈ నెల 9వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో లెక్కింపు ఉంటుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

బదిలీలకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ల వారీగా ఈ ప్రక్రియను నిర్వహించారు. గ్రేడ్-1లో 10 మంది, గ్రేడ్-2లో 29 మంది, గ్రేడ్-3లో 66 మందిని బదిలీ చేశారు. ఐదేళ్లు ఒకే చోట పనిచేసినవారు, విజ్ఞప్తి బదిలీలు కలిపి మొత్తం 105 మందికి స్థానచలనం కల్పించినట్లు డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. గ్రేడ్-4 కార్యదర్శులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

సెక్టోరల్ అధికారుల నియామకం



కో ఆర్డినేటర్ మధుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష శాఖకు నూతన సెక్టోరల్ అధికారులు నియమితులయ్యారు. ఈ మేరకు డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ ఉత్తర్వులు జారీచేశారు. యాదమరి జెడ్పీ పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ జే.మధును ఐఈ కో-ఆర్డినేటర్‌గా, రామకుప్పం మండలం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఈ.ఇంద్రాణిని ప్లానింగ్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌గా, మాపాక్షి హైస్కూల్ ఉపాధ్యాయులు మధుసూధననాయుడు ను అసిస్టెంట్ సీఎంవోగా, రామకుప్పం మండలం జెడ్పీ ముద్దనపల్లిలో పనిచేస్తున్న నందకుమార్‌ను ఏఎస్‌వో-1 గా, శాంతిపురం మండలం బండపల్లిలో పనిచేస్తున్న చాన్‌బాషాను ఏఎస్‌వో-2గా నియమించారు. నియమితులైన నూతన సెక్టోరల్ అధికారులకు ఉపాధ్యాయ సంఘ నాయకులు మునీర్, ముక్తార్, ఈశ్వరయ్య శుభాకాంక్షలు తెలిపారు.





ఎన్నికలకు ముందు పలమనేరు సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

బాబు మాటంటే.. నీటి మూటే

చంద్రబాబు నాయుడు మాటంటే నీటి మూటేనని మరోమారు రుజువైంది. 2014 ఎన్నికల్లో ఎట్లాగైతే రుణమాఫీ పథకం ప్రకటించి, ఆపై వల్లకాదని చేతులెత్తేశారో.. 2024 ఎన్నికల హామీలపై అస్సలు దృష్టి పెట్టలేదు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పర్యటించిన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఊరూరా ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ హబ్‌లు, సాగునీటి-తాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని గుప్పించిన హామీలన్నీ నీటిమూటలయ్యాయి. అప్పుడేమో సంపద సృష్టించి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే హామీలు నెరవేరుస్తామని బీరాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు ఖజానా ఖాళీ అయిందంటూ బీద అరుపులు అరుస్తున్నారు.

– చిత్తూరు అర్బన్

- అప్పుడు సంపద వరాలు.. ఇప్పుడు బీద అరుపులు
- ఊరికో హామీ.. హామీకో సమాధి
- వర్సిటీలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు ..
- ఒక్కటంటే ఒక్కటీ కార్యరూపం దాల్చని వైనం

జిల్లా కేంద్రమైన చిత్తూరుకు గతేడాది మే 11న వచ్చిన చంద్రబాబు బహిరంగ ప్రసంగంలో ఇచ్చిన హామీలు.. ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం, జిల్లా కేంద్రాన్ని విద్యాహబ్‌గా మారుస్తాం, ఐటీ టవర్, పరిశ్రమల ఏర్పాటు, చిత్తూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. కానీ వీటిలో ఒక్క హామీను కూడా నెరవేర్చడానికి బీజం పడలేదు. గతేడాది ఫిబ్రవరి 6, 7 తేదీల్లో చిత్తూరు నియోజకవర్గంలో యువగళంలో పర్యటించిన నారా లోకేష్.. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తామని, ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. చెప్పిందానికి పూర్తి భిన్నంగా పథకాన్ని రద్దు చేశారు. ఇక చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మానుఫాక్చర్ ఫ్యాక్టరీ ఏర్పాటు లాంటి హామీలు లెక్కేలేదు.

- గంగాధరనెల్లూరులోని కత్తెరపల్లె గ్రామంలో... 2023లో జనవరి 11న యువగళం పాద యాత్రలో భాగంగా 200 కి.మీ పూర్తిచేసుకున్న నారా లోకేష్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామన్న హామీ ఆచరణకు నోచుకోలేదు. కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చే బాధ్యత తనదనిచెప్పి, ఇప్పుడు పక్కకు తప్పుకున్నారు.
- పలమనేరులో ఎన్నికల నేపథ్యంలో పర్యటించిన చంద్రబాబు నాయుడు గతేడాది మార్చి 27న నిర్వహించిన బహిరంగ సభలో హామీల వరాలు గుప్పించారు. ప్రపంచంలోని అన్ని కంపెనీల్లో పలమనేరువాసులు ఉండేలా, ఇంట్లో కూర్చుని ఉద్యోగాలు చేసేలా చూస్తామన్నారు. కృష్ణా జలాలనే కాదు గోదావరి జలాలను సైతం తీసుకొస్తామన్నారు. వ్యవసాయానికి గుండెకాయలాంటి పలమనేరు ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, గంజాయి, డ్రగ్స్ కనిపించకుండా చేస్తామన్నారు. కానీ ఏపీ నుంచి బెంగళూరుకు తరలే గంజాయి మొత్తం పలమనేరు మీదుగానే వెళుతోంది.
- యువగళం పాదయాత్రలో భాగంగా 2023 ఫిబ్రవరి 13వ తేదీన పుత్తూరు బహిరంగ సభలో పాల్గొన్న నారా లోకేష్.. విజయపురం కోసలనగరంలో ఏపీఐఐసీ ద్వారా ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని, గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తిచేస్తామని, నగరిలో టెక్స్‌టైల్స్ పార్కు, పవర్‌లూమ్ పరిశ్రమలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, అగ్నికుల క్షత్రియులకు బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. వీటన్నింటినీ తాము అధికారంలోకి ఇచ్చిన తొలి ఏడాదిలోనే పూర్తి చేస్తామని చెప్పిన చినబాబు.. ఒక్క హామీ నెరవేరిస్తే ఒట్టు. చేనేతలకు 500 యూనిట్లకు ఉచిత విద్యుత్‌పై జీఓ విడుదల చేశారేతప్ప.. కార్యాచరణకు నోచుకోలేదు.
- పుంగనూరును సింగపూర్ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు.. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా అభివృద్ధి సమావేశాలు, జెడ్పీ సమావేశాల్లో గత ప్రభుత్వం పుంగనూరులో ఎందుకు అన్ని రూ.కోట్లు ఖర్చు చేసిందని..? ఎందుకు పరిశ్రమలు వచ్చాయని ప్రశ్నించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

- పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళెంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఏనుగుల సంచారం ఎక్కువగా ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చే ట్రెంచ్‌లు తవ్వించి సోలార్ ఫెన్సింగ్ వేయిస్తామని హామీ ఇచ్చారు. దీని గురించి ఇంతవరకు పట్టించుకోలేదు.

కుప్పానికి ఇచ్చిన వరాలు ఇవే..

ఎన్నికల ముందు కుప్పంవాసులకు చంద్రబాబు కురిపించిన వరాల జల్లులు అన్నీ ఇన్నీ కావు.

- టెకీలు వర్క్ ఫ్రం హోం చేసుకోవడానికి ప్రతి మండలానికి వర్క్ స్టేషన్
- నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- పొలాలకు రోడ్లు, బెంగళూరు నుంచి సజ్జాపురం మీదుగా కుప్పంకు ఫోర్‌లేన్ రోడ్డు, రూ.100 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు
- బెంగళూరు సిటీతో కుప్పానికి అనుసంధానం
- వంద ఎకరాల్లో గ్రానైట్ పరిశ్రమ
- లాయర్లు, జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు ఇస్తాం.
- ఒక్కో పంచాయతీకి రూ.కోటి-రూ.2 కోట్ల నిధుల కేటాయింపు,
- హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొస్తాం
- మల్లానూరు, రాళ్లబూదుగూరును ప్రత్యేక మండలాలుగా గుర్తిస్తాం
- కుప్పం-పలమనేరు ఫోర్‌లేన్ రోడ్డుగా మారుస్తాం



నారా లోకేష్ 2023లో యువగళాన్ని కుప్పంలో ప్రారంభించి ఇచ్చిన హామీలు..

- యువత కోసం ప్రత్యేక మేనిఫెస్టో తీసుకొస్తాం
- ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం
- రాయలసీమ రైతులకు ఉచితంగా డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తాం.
- కుప్పంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం.
- రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- విద్యుత్ చార్జీలు, ఉప్పు-పప్పు, గ్యాస్, వంట నూనెల ధరలు తగ్గిస్తాం.
- కుప్పంలో పరిశ్రమలు తీసుకొస్తాం
- ప్రజలకు ఉపాధి కల్పించి వలసల నివారిస్తాం

ఇచ్చిన హామీల్లో ఈ ఏడాదిలో ఒక్కటంటే కార్యరూపం దాల్చలేదు. అందుకే ఇప్పటికే పుష్-పుల్ రైల్లో ఉదయం 6.30 గంటలకు ప్రతిరోజూ పనుల కోసం కుప్పంవాసులు బెంగళూరుకు వలసలు వెళుతూనే ఉన్నారు.

ఏ రైతూ సంతోషంగా లేదు



ఎన్నికలపుడు పలమనేరులో చంద్రబాబు మాట్లాడుతూ, ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ రైతు అయినా సంతోషంగా ఉన్నాడా? ఏ పంటకైనా ధరలున్నాయా? టమాటా సాగు చేసి ఇప్పటికే రూ.నాలుగున్నర లక్షలు నష్టపోయాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే టమాటాను కొనుగోలు చేసింది. తప్పుడు హామీలిచ్చిన కూటమి నేతలను మా ముందుకు రమ్మనండి మా బాధలు చూసైనా న్యాయంచేస్తారేమో.

– గోవిందురెడ్డి, ఆదర్శరైతు, బేరుపల్లి, పలమనేరు మండలం

మాట తప్పిన లోకేష్



మా ఊర్లో లోకేష్ పాదయాత్రకు గుర్తుగా 200 కి.మీ శిలాఫలకం వేసి, ఏడాదిలో కాలేజీ పెడతామన్నారు. శిలాఫలకమైతే అట్లాగే ఉంది కానీ కాలేజీకి మాత్రం కనీసం పునాదిరాయి కూడా వేయలేదు. రాజకీయాల్లో మాట ముఖ్యం. నాయకులే ఇచ్చిన మాట తప్పితే ఎట్లా చెప్పండి..?

– మురగయ్య, కార్వేటినగరం

ఒకే ఒక్కడు

పేదల కల సాకారం చేసిన నాయకుడు



గత ప్రభుత్వ పాలనలో ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో అప్పటి మంత్రి రోజా

చిత్తూరు కలెక్టరేట్ : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పేదలకు గత వైఎస్సార్‌సీపీ సర్కారులో ఇళ్ల పట్టాలతో పాటు పక్కా గృహాలను మంజూరు చేశారు. గత ప్రభుత్వ పాలన చక్కటి ప్రణాళికతో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అవసరమైన రోడ్లు, కాలువలు, నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. ఈ పథకానికి గత వైఎస్సార్‌సీపీ సర్కారు కోట్ల నిధులను ఖర్చు చేసింది. లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమీక్షిస్తూ గత ఐదేళ్ల పాటు పక్కాగృహాల పథకాన్ని పకడ్బందీగా అమలు చేశారు. అర్హులైన పేదలందరికీ కులం, మతం, వర్గం, పార్టీలు అనే తేడా లేకుండా బృహత్తర లక్ష్య సాధనతో పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 2019వ సంవత్సరానికి ముందు పేద ప్రజలు అద్దె గృహాల్లో ఉంటూ నెలవారీ వేల కొద్దీ అద్దెలు చెల్లించేవారు. కూలీ పనులు, చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే పేద ప్రజలు సంపాదించే అతి కొద్ది సంపాదనలో సగానికిపైగా నగదు అద్దె కోసమే చెల్లించేవారు. అలాంటి పరిస్థితుల నుంచి గత ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ సర్కారు అమలు చేసిన ఉచిత ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలతో జిల్లాలోని పేద ప్రజలు లబ్ధిపొందారు. ఈ పథకంలో లబ్ధిపొందిన పేదలు పక్కా ఇళ్ల గృహాలు నిర్మించుకుని ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు వల్లే సొంత గృహాలను నిర్మించుకున్నామని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత ఐదేళ్లలో మంజూరు చేసిన పక్కా గృహాల వివరాలు

నియోజక వర్గం	మంజూరైన గృహాలు	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లలో
చిత్తూరు	9748	రూ.175.48
కుప్పం	5562	రూ.100.11
పుంగనూరు	15665	రూ.281.97
నగరి	4599	రూ.82.78
జీడీ నెల్లూరు	12505	రూ.225.09
పూతలపట్టు	12061	రూ.217.09
పలమనేరు	12131	రూ.218.35
మొత్తం	72272	రూ.1300.87

జిల్లా ఆస్పత్రి అలర్ట్



జిల్లా ఆస్పత్రి అలర్ట్ అయింది. ఆస్పత్రికి రాష్ట్ర స్థాయి అధికారులు మంగళవారం విచారణకు రానున్నారని ముందస్తుగానే సంసిద్ధమైంది. ఈ తరుణంలో ఆస్పత్రి ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఆస్పత్రి సమస్యలు పట్టించుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వసూళ్ల పర్వానికి, వేధింపులకు అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

- నేడు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి విచారణ కమిటీ రాక
- సన్నద్ధమైన ఆస్పత్రి అధికారులు
- వసూళ్ల పర్వానికి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి
- వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం రాష్ట్ర స్థాయి నుంచి విచారణ కమిటీ రానుంది. ఇటీవల వచ్చిన పలు ఫిర్యాదుల కారణంగా ప్రభుత్వం ఆస్పత్రిపై విచారణ కమిటీని నియమించింది. కమిటీలో రాష్ట్ర డీఎస్‌హెచ్ రమేష్ నాథ్, డిప్యూటీ కమిషనర్ రమేష్ కిషోర్, రాష్ట్ర వైద్యవిధాన కార్యదర్శి పద్మకుమారి, రాష్ట్ర డీఎస్‌హెచ్ ఈఈ విజయ భాస్కర్, రాష్ట్ర డీఎస్‌హెచ్ బయో మెడికల్ ఇంజినీర్ సందీప్ రెడ్డిని నియమించింది. వీరు విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు. ఈ కమిటీతో అయినా జిల్లా ఆస్పత్రి బాగుపడేనా అన్న ఆశ ప్రజల్లో మొదలైంది.

ఇవీ సమస్యలు..

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి- అపోలో మధ్య సమన్వయ లోపం కారణంగా వైద్య సేవలు కుంటుపడుతున్నాయి.
- బదిలీల విషయంలో ఇన్ -అవుట్ ఉండాలి.
- పోస్టుమార్టంకు నలుగురు డాక్టర్లు కావాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నాయి.
- స్టాఫ్ నర్సు, ఫార్మసిస్ట్, డాక్టర్లు, ఎఫ్ఎంఓ, ఎంఎన్‌ఓ ఇలా పలు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.
- మందులు, మాత్రల కొరత వేధిస్తోంది. చాలా వరకు కిట్లు అందుబాటులో లేవు.
- రెఫర్ కేసులు పెరుగుతున్నాయి.
- వార్డులకు తాగునీటి సౌకర్యం లేదు.
- జిల్లా వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్‌కు రూ.5 వేలు, ప్రమోషన్ తదితర వాటికి సంబంధించి రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ అధికారి శాఖ కమిషనర్ తెలుసంటూ ఈ దందాలకు పాల్పడుతున్నట్లు కొందరు వైద్యులు వాపోతున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఆ పనులు జరగడం లేదని చర్చించుకుంటున్నారు. పైసలు ఇస్తే తప్ప పనులు జరగడం లేదన్న విషయం బహిరంగ రహస్యం.
- ఇష్టానుసారంగా శాశ్వత బదిలీలు చేయిస్తున్నారు. ఇందుకు రూ.50 వేలు తీసుకున్నారని పలువురు బహిరంగంగా చెబుతున్నారు.
- కమిషనర్, కలెక్టర్ ఇచ్చిన డిప్యుటేషన్లను జిల్లా అధికారులకే తెలియకుండా కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి డిప్యుటేషన్లను ఇటీవల రద్దు చేశారు. అతని స్వార్థ రాజకీయాలకు ఆస్పత్రిలో పనిచేసే కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది బలవుతున్నారు.
- బదిలీల నేపథ్యంలో ఇక్కడే పాతుకుపోవడానికి కమిటీల పేరుతో కుయుక్తులు పన్నుతున్నారు.
- జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పని చేస్తున్న సూపరింటెండెంట్లను శాసిస్తున్నారు. ప్రశ్నిస్తే రూల్స్ పేరుతో వారిని శాసిస్తున్నారు. ఇప్పుడే రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి ఫోన్ చేశానని, వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. తిరగబడే వారిపై, సహచర ఉద్యోగుల ద్వారా డ్యూటీలో వేధింపులకు గురి చేస్తున్నారు.
- కొందరు డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. వీటిలో కొన్ని మార్పులైనా తీసుకొస్తే ఆస్పత్రికి పట్టుకున్న జబ్బు నయమవుతుంది. అక్రమాలు, వేధింపులు లేకుంటే పారదర్శకమైన సేవలను చూడవచ్చు.

రేపటి నుంచి విత్తనాల పంపిణీకి నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా వేరుశనగ విత్తన పంపిణీకి జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి వేరుశనగ విత్తన కాయలకు నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు కే6 రకం విత్తనం-25,038 క్వింటాళ్లు, నారాయణి రకం 605.6 క్వింటాళ్లు రాగా, మొత్తం 25,643 క్వింటాళ్లు వచ్చాయి. బ్యాగు ధర (30కేజీలు) రూ.1,674 నిర్ణయించారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ముందస్తుగా రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

ఉత్సాహంగా యోగాంధ్ర



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ

పెనుమూరు(కార్వేటినగరం): యోగాను రోజువారీ దినచర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మండలంలోని పులిగుండు వద్ద సోమవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. దీనికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోల్ మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2300 మంది భాగస్వాములు కావడంతో విజయవంతమైందన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఎస్పీ బాలాజీ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, అధికారులు, ఎస్వీసెట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోరు మోటార్ కేబుల్ చోరీ


వ్యవసాయ బోర్‌లో కేబుల్ వైర్ల చోరీ

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం మతుకువారిపల్లెలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతు ఎం.చంద్రశేఖరరెడ్డి పొలంలో వేసిన రెండు బోర్లకు ఉన్న కేబుల్ వైర్లను కత్తిరించుకుని పోయారు. ఉదయం లేచి బోరు వద్దకు వెళ్లి చూడగా వైర్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. మండలంలో ఎక్కడో ఒకచోట ఈ వైర్ల చోరీలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మతుకువారిపల్లె చుట్టు పక్కల నెల రోజుల్లో దాదాపు 15 మంది రైతులకు చెందిన బోర్ కేబుల్‌వైర్లు కత్తిరించుకుపోయారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78, 031 మంది స్వామివారిని దర్శించుకోగా 32,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

బాబుగారి భవంతి సరే..

మా పరిస్థితేంటి సారూ!

- అప్పట్లో కొత్త ఊర్లు, ఇప్పుడు ఊరికో ఇల్లు లేదే!
- జిల్లాలో గత ప్రభుత్వంలో మంజూరైన మొత్తం ఇళ్లు 77,366
- కూటమి పాలనలో ఒక్క ఇల్లు పునాదులేసింటే ఒట్టు
- జిల్లాలో స్తంభించిన పక్కా ఇళ్ల నిర్మాణ పనులు


పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి లేఅవుట్‌లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

పలమనేరు: సీఎం చంద్రబాబు కుప్పంలో మాత్రం కొత్త ఇల్లు కట్టుకొని కొత్త హెలీక్యాప్టర్‌లో సకుటుంబ సమేతంగా వచ్చి గృహప్రవేశం చేసుకొని సంతోషంగా వెళ్లిపోతే ఇంటి బిల్లులందక మాలాంటి పేదలు ఎప్పుడు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేదని గత ప్రభుత్వంలో పక్కా ఇళ్లను పొందినవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఏడాది పాలనలో ఇప్పటిదాకా ఓ ఇంటి పునాదికూడా మొదలుకాలేదని కూటమి పార్టీకి చెందినవారు మదన పడితున్నారు. కూటమి పాలనలో జిల్లాలోని హౌసింగ్ కార్యాలయాల్లో ఎలాంటి పనులు ముందుకు సాగక నిర్మానుష్యంగా మారాయి. గత ప్రభుత్వంలో కొత్త ఊర్లు నిర్మించగా ఈ కూటమి హయాంలో ఊరికో ఇల్లు కూడా మంజూరు కాలేదు.

గత ప్రభుత్వంలో ఇలా....

సొంతిల్లు కట్టుకోవాలన్నదే పేద వాడి కలను నిజం చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలమనేరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా గృహాలను మంజూరు చేసింది. జిల్లాలో 77,365 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో 609 జగనన్న లేఅవుట్లున్నాయి. మొత్తంగా జిల్లాలో 46,163 వేల ఇళ్లు పూర్తి కాగా 31,203 ఇళ్ల వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6,719 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా కేవలం 2,389 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 4,330 ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. జిల్లాలో వీటి నిర్మాణాలకోసం గత ప్రభుత్వం రూ.1000.687 కోట్లను ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వంలోనూ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులిస్తామని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. లబ్ధిదారులతో అధికారులు సమావేశాలను నిర్వహించినా ఫలితం కనిపించడం లేదు. దీంతో హౌసింగ్ అధికారులు నిర్మాణాలను ఎలా వేగవంతం చేయాలో అర్థంకావడం లేదు.

పలమనేరులో జగనన్న కాలనీని చూద్దాం

పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి కాలనీలో మొత్తం 3031 ఇళ్లు మంజూరైతే ఇందులో వీటిల్లో 1721 మాత్రం పూర్తయ్యాయి. మిగిలిన 1310 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో 14 ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. నియోజకవర్గంలో 12 లేఅవుట్లున్నాయి. ఈ విషయమై స్థానిక హౌసింగ్ డీఈ దాస్‌ను వివరణ కోరగా డివిజన్ పరిధిలో గత కొన్నాళ్లుగా పక్కాగృహాల నిర్మాణ పనులు వేగంగా సాగడం లేదని చెప్పారు. ఇంటి పనులు చేసిన వారికి బిల్లులిస్తామని లబ్ధిదారులతో అవగాహన సమావేశాలను సైతం నిర్వహించామన్నారు.

కొత్త గృహాల ఊసేలేదు

గత ప్రభుత్వంకంటే ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణాలు చేపడతామని కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఊదరగొట్టింది. కానీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ఓ ఇంటి పునాదికూడా పడలేదు. ఆరునెలల క్రితం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పంచాయతీలవారీగా కూటమి నేతల ద్వారా పక్కా ఇళ్లకు అర్జీలను తీసుకున్నారు. ఆ మేరకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు కాకుండా కేవలం కూటమి కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేయించేలా హౌసింగ్ అధికారులకు వాటిని పంపారు. వీరి లెక్కమేరకు జిల్లాలో సుమారు 30వేల మంది లబ్ధిదారులుగా చేర్చారు. కానీ ఇప్పటిదాకా ఒక్కరంటే ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు కాకపోవడం కొసమెరుపు. ఈ విషయమై పలమనేరు హౌసింగ్ డీఈ దాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కార్యాలయంలోని సిబ్బందిని అడగ్గా మీకు తెలియందేముంది సార్ ముందులాగా ఇప్పుడు లేదు పాత ఇళ్లే ఇంకా పూర్తిగాక ఇబ్బంది పడుతుంటే మళ్లీ కొత్త ఇళ్లు ఎప్పుడొస్తాయో ఎలా చెప్పేదన్నారు.

ఆఖరి బిల్లు రాలేదు



గత ప్రభుత్వంలో మా తల్లి సరస్వతి బాయి పేరిట పక్కా ఇల్లు మంజూరైంది. మూడు బిల్లులు పడ్డాయి. ఆఖరి బిల్లు రూ.30వేలు రావాల్సి ఉంది. అయితే ముందుగా పనిచేసేందుకు డబ్బులేదు. అందుకే ఇంటిపని పెండింగ్ పడింది. అయితే డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు ఇస్తారని చెప్పారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి ప్రభుత్వం మారింది.

– స్వర్ణాసింగ్, పాపేపల్లి జగనన్న లేఅవుట్, వీకోట

గుడిసెలోనే ఉన్నాం



అడవిలో ఉన్న మా గ్రామంలో ఇంటి పట్టాలు లేక పక్కా ఇల్లు రాకుండాపోయె. గత ప్రభుత్వంలో ఇంటిపట్టా ఇచ్చారు. అప్పుడే ఎలక్షను వచ్చేసింది. ఈ ప్రభుత్వంలో పక్కా ఇంటికోసం రాసుకోనిపోయినారు. కానీ ఇంతవరకు అతీగతీలేదు. గుడిసెల్లోనే పిల్లాపాపలను వేసుకొని బతుకుతున్నాం. వానలు వచ్చినప్పుడు మా బాధ చెప్పనుకాదు సామీ.

– నాగమ్మ, కుయ్యవంక

ఊరికో ఇంటినైనా కట్టించారా?



పేదల ఇళ్లు ఏమైతే నాకేమని సీఎం మాత్రం కుప్పంలో రెండెకరాల్లో కొత్త ఇల్లు కట్టుకున్నారు. ఆ ఇంటి గృహప్రవేశానికి ప్రజాధనంతో కొన్న కొత్త హెలీక్యాప్టర్‌లో వచ్చారు. గత ప్రభుత్వంలో మంజూరైన వేలాది ఇళ్లకు బిల్లులిచ్చి వారిచే గృహప్రవేశాలు చేయిద్దామని ఆయనకు లేదు. పోనీ కూటమిని నమ్ముకున్నవారికైనా ఇళ్లు ఇచ్చిందా అని ఆపార్టీ వారే ఆలోచించుకోవాలి.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే పలమనేరు

బాత్‌రూమ్ అంత లేదన్నారు



గత ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లను మంజూరు చేసినప్పుడు ఆ ఇండ్లు బాత్‌రూమ్ అంత కూడా లేవని విమర్శించారు. ఇప్పుడు వారి ప్రభుత్వం అధికారంలో ఉంది. సువిశాలంగా మూడేసి సెంట్లతో పక్కా ఇళ్లను మంజూరు చేసి నిర్మించి ఇవ్వొచ్చుకదా. గత ప్రభుత్వం మంజూరు చేసిన వేలాది ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇప్పుడు అవి చూస్తుంటే బాధేస్తోంది.

– సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షులు

పోలీసు గ్రీవెన్స్‌కు 53 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. చిత్తూరు నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి


మామిడితోటలో కాయలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బంగారుపాళెం: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం మామిడికి గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. తోతాపురి రకం మామిడి ప్రస్తుతం కిలో రూ.4 నుంచి రూ.5కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులు పెట్టిన ఖర్చులు సైతం రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టులాడుతున్నారని పేర్కొన్నారు. గుజ్జు పరిశ్రమ యజమానులతో సంప్రదించి మామిడికి కనీస ధర కిలో రూ.25గా నిర్ణయించాలన్నారు. అనంతరం నాయకులతో కలసి గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకరన్, జిల్లా ఉపాధ్యక్షుడు వాడా గంగరాజు, రైతు సంఘ నాయకులు సుబ్రమణ్యం, లోకేష్, రాజన్న పాల్గొన్నారు.

నాటు బాంబు ఉండను తొక్కి వ్యక్తికి తీవ్రగాయాలు

బంగారుపాళెం: తాను తీసుకున్న గోతిలో తానే పడ్డ చందాన తాను దాచి పెట్టిన నాటు బాంబు ఉండను తొక్కి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు, వెలుతురుచేను పంచాయతీ పులిమడుగు గ్రామానికి చెందిన బాలకృష్ణ కుమారుడు వినాయకం(35) తమిళనాడు నుంచి నాటు బాంబు ఉండలు తెప్పించి వాటితో అడవి జంతువులను చంపి వాటి మాంసాన్ని అమ్మేవాడు. ఈ క్రమంలో తన ఇంటి ఆవరణలోని మల్లెపూల చెట్టు పొదలో నాటు బాంబు ఉండలను దాచిపెట్టాడు. మల్లె పొద వద్ద కుక్క ఉండడంతో తరమడానికి పరుగెత్తాడు. ఈ క్రమంలో నాటు బాంబు ఉండపై కాలు వేయడంతో అది పేలి కుడిపాదం ఛిద్రమైంది. కుటుంబ సభ్యులు వినాయకంను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఇన్‌చార్జి వీఆర్ఓ హేమచంద్రా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు బైక్ ఢీ: ఒకరి దుర్మరణం


వెంకటస్వామి (ఫైల్)

పులిచెర్ల(కల్లూరు): కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చింతలవారిపల్లెకు చెందిన వెంకటస్వామి(62), నారాయణమ్మ(60) దంపతులు పూరేడివారిపల్లెలో ఉన్న అల్లుడు వాసు (40) ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి అల్లుడు వాసుతో కలిసి ద్విచక్రవాహనంపై వీరు ముగ్గురూ బయల్దేరారు. మార్గమధ్యంలో పీలేరు రోడ్డులోని తాజ్ హోటల్ వద్ద తెలంగాణ నుంచి తిరువణ్ణామలైకి వెళుతున్న కారు ఈ బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటస్వామి మృతి చెందారు. మరో ఇద్దరిని తమిళనాడులోని రాణిపేటలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గోపి(ఫైల్)

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు, మండలంలోని ఏపేరి గ్రామానికి చెందిన నాగూర్ శెట్టి కుమారుడు ఎం.గోపి(25) పుట్టుకతో మూగవాడు. సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెదురుకుప్పం బయలుదేరాడు. మార్గమధ్యంలోని పాతగుంట గ్రామంలో పెనుమూరుకు వెళ్తున్న పుత్తూరు డిపోకు చెందిన బస్సు ఢీకొనడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తల్లిదండ్రులు వైకల్యంతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఆస్తి వివాదంలో మహిళలపై దాడి

శాంతిపురం: మఠం పంచాయతీలోని వెంకటేష్‌పురంలో ఆస్తి పంపకాల వివాదం నేపథ్యంలో ఓ వర్గానికి చెందిన మహిళలు, పిల్లలపై మరో వర్గం వారు దాడి చేసింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితురాలు పార్వతమ్మ రాళ్లబూదుగూరు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు. గ్రామానికి చెందిన అనసూయమ్మ, ఆమె బావ నారాయణప్ప కుటుంబానికి గత దశాబ్ద కాలంగా ఆస్తి పంపకాల్లో వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో గత నెల 31న అనసూయమ్మకు మద్దతుగా కావర్లపల్లి సల్లాపురి వర్గీయులు వచ్చి తనతో సహా మరో ఇద్దరు మహిళలు, తన మనుమరాళ్లైన ముగ్గురు బాలికలపై దాడి చేసి కొట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ చెప్పారు.

రెండో రోజూ సర్వర్ మొరాయింపే!


పాలసముద్రం మండలంలో రేషన్ కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా రెండు రోజు కూడా రేషన్ పంపిణీకి సర్వార్ మొరాయించింది. ఉదయం నుంచి రాత్రి వర సర్వర్ పని చేసినప్పుడల్లా కార్డుదారులకు రేషన్ ఇచ్చేందుకు డీలర్లు ముప్పుతిప్పలు పడ్డారు. బియ్యం సంచికి వచ్చేంత వరకు కార్డుదారులు పడిగాపులు కాశారు. చాలా చోట్ల డీలర్లు వారి ఇష్టానుసారంగా రేషన్ దుకాణం తలుపులు తీశారు. 8 గంటలు పనివేళలు నామమాత్రంగానే కనిపించింది. నిరీక్షణతో కార్డుదారులు విసిగిపోయారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు అవస్థల నడుమ రేషన్ పట్టుకెళ్లారు. జిల్లాలో ఇప్పటి వరకు 37.58 శాతం పంపిణీ పూర్తయిందని డీఎస్ఓ శంకరన్ వెల్లడించారు.

ఆకస్మిక తనిఖీలు చేయండి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆకస్మికంగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఆదేశించారు. జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేసిన ఆమె కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కేంద్రాలకు అప్రోచ్ రోడ్డును వేయాలన్నారు. బాల్య వివాహాల కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో బాల్యవివాహాలు కట్టడి చేయాలన్నారు.

మండలాల వారీగా వివరాలు పంపండి

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల వివరాలను మండలాల వారీగా పంపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల, ఎత్తు బరువులను కచ్చితత్వంతో కొలవాలన్నారు. జిల్లాలో పురుషులతో పోలిస్తే స్త్రీ జనాభా తక్కువ ఉందన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరీ, డీఎంహెచ్‌వో సుధారాణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే వేటు తప్పదు: ఆర్జేడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల పాయింట్ల విషయంలో అలసత్వం వద్దని తప్పులు చేసే వేటు ఖాయమని వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన సోమవారం డీఈవో కార్యాలయం పక్కనున్న పాఠశాలలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తును పరిశీలించారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బదిలీల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బదిలీల పాయింట్ల విషయంలో ఎవరైనా తప్పులు చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. కొందరి ఎంఈవోలపై ఫిర్యాదులు అందుతున్నాయని, తీరు మార్చుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఈవో వరలక్ష్మి, ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్, పలు మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

టీచర్లకు న్యాయం చేయాలి

పీఎస్ హెచ్‌ఎం బదిలీల్లో నష్టపోయిన నలుగురు టీచర్లకు న్యాయం చేయాలని ఆర్జేడీని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆర్జేడీకి వినతిపత్రం అందజేశారు. ఆయన ఆర్జేడీతో మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులు స్పౌజ్ ఉన్న వారికి స్పౌజ్ పాయింట్లు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, ఇతర నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎస్పీ భాషా, రెడ్డెప్ప, శేఖర్ పాల్గొన్నారు.

పరారీలో వసూల్ రాజా సర్వేయర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఒక విలేజ్ సర్వేయర్ పెద్ద ఎత్తున అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఘటన చిత్తూరులో వెలుగులోకి వచ్చింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం, చిత్తూరు మండలంలోని ఓ సచివాలయ పరిధిలో ఒక సర్వేయర్.. సర్వే సమస్యలు ఉన్నవారిని నమ్మించి, వాటిని పరిష్కరిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేశాడు. గ్రామంలో మొత్తం రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చివరకు ఎవరికీ పనులు జరగకపోవడంతో ఓ బాధితుడు ఫోన్‌పే ద్వారా పంపిన డబ్బుల ఆధారంగా ఇతర బాధితుల వివరాలు కూడా సేకరించి అధికారులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

అయితే అప్పటికే సర్వేయర్ పరారీలో ఉండడంతో అధికారులు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపినట్టు తెలుస్తోంది. కాగా, ఇదంతా ముందే తెలిసినా, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులు సర్వేయర్‌కు పరారీలో ఉండమని సూచించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

అయ్యా..మా మొర ఆలకించండి సారూ!

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్
- పలు సమస్యలపై 275 అర్జీల స్వీకరణ


అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యా.. మా మొర ఆలకించి న్యాయం చేయండంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు విచ్చేసి తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గ్రామకంఠంగా మార్చండి

తమ గ్రామంలోని పలు సర్వే నంబర్లను గ్రామ కంఠంగా మార్చాలని చౌడేపల్లె మండలం తమినిగుంట గ్రామానికి చెందిన అర్జీదారులు నల్లప్ప రెడ్డి, వేణుగోపాలు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని 9 ఎకరాల్లో 182 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. సర్వే నెంబర్లు 170/1,744,778,757 ను గ్రామకంఠంగా మార్చాలని కోరారు.



రోడ్డు కోసం..



గ్రామానికి రోడ్డు మార్గం లేదు రోడ్డు వేయించండి అంటూ గుడిపాల మండలం చామంచిపురానికి చెందిన గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన గ్రామస్తులు మాట్లాడుతూ కమ్మతిమ్మపల్లె నుంచి తమ గ్రామానికి దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. అందులో ఒక కిలోమీటర్ వరకు మాత్రమే తారు రోడ్డు మంజూరు చేశారని, మిగతా భాగం రోడ్డులేదన్నారు. రోడ్డు సమస్య వల్ల బస్సు సౌకర్యం సైతం లేదన్నారు. రేషన్ సరుకులకు కమ్మతిమ్మపల్లికి వెళ్లి రావాల్సి ఉందన్నారు. కమ్మతిమ్మపల్లి నుంచి రేణుకాపురం మీదుగా చామంచిపురం వరకు రోడ్డు మార్గం వేయించాలని కోరారు. మినీ రేషన్ డీలర్ షాపు, బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు.

డీకేటీ భూముల ఆక్రమణకు ప్రయత్నం

డీకేటీ పట్టా భూముల ఆక్రమణకు మాజీ సైనికుడు ప్రయత్నిస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం కొండపల్లికి చెందిన గ్రామస్తులు సుబ్రహ్మణ్యం, మార్కొండ చెప్పారు. వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తమ గ్రామంలోని 50 మందికి పైగా డీకేటీ పట్టాలు ఇచ్చారన్నారు. అదే ప్రాంతంలో మాజీసైనికుడికి 5 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. తన భూమితో పాటు పక్క భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వారు తెలిపారు.

